పోస్టర్ ఆవిష్కరణ



డబీర్‌పురా: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం మంత్రి జి.కిషన్ రెడ్డి ఈద్–ఇ–గదీర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, వక్ఫ్ సుధార్ జన జాగరణ్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్ జి.మనోహర్‌రెడ్డి, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల అందజేత



స్కూల్ బ్యాగులను అందజేస్తున్న కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్

గన్‌ఫౌండ్రీ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా మంగళవారం గన్‌ఫౌండ్రీలోని ఆలియా మోడల్ హైస్కూల్, మహబూబియా ప్రభుత్వ పాఠశాలలో గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్ భీక్ష్య విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుధాకర్ పైప్స్ సహకారంతో విద్యార్థులకు లంచ్ బాక్స్, ఇతర సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ డైరెక్టర్ నీలా సంజయ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

బంజారాహిల్స్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని సర్కిల్–17 కార్యాలయంలో ఆయన ట్రాఫిక్ ఏసీపీ కే హరిప్రసాద్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, హైడ్రా ఎస్‌ఎఫ్‌ఓ మోహన్‌రావు, ఈఈ వెంకటనారాయణ, డీఈలు చైతన్య, సందీప్‌తో సమావేశం నిర్వహించారు. హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లతో కలిసి సమన్వయంగా పనిచేయడం ద్వారా వరద ముంపు సమస్య తలెత్తకుండా చూడవచ్చని వెల్లడించారు. ట్రాఫిక్ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.



మాట్లాడుతున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

బోనాల ఉత్సవం.. తొట్టెలకు ప్రాధాన్యం

- తెలంగాణలో అమ్మవారికి మొక్కుల రూపంలో తొట్టెల సమర్పణ ఆనవాయితీ
- 3 అడుగుల నుంచి 35 అడుగుల ఎత్తు వరకు తయారీ..
- సాధారణ రోజుల్లో కూడా మొక్కుల రూపంలో తొట్టెల సమర్పణ



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో తొట్టెలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా భక్తులు తొట్టెల రూపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ తొట్టెలలో అమ్మవారు సేద తీరుతారని భక్తుల విశ్వాసం. అమ్మవారికి ఊయల లాగా ఈ తొట్టెలను సమర్పిస్తారు. కోరిన కోర్కెలు తీరాలని కొందరు..ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండాలని మరికొందరు తాము అనుకున్న పనులు కావాలంటూ ఇంకొందరు తొట్టెలలను అమ్మవారికి సమర్పిస్తుంటారు. బోనాల ఉత్సవాల నిర్వాహకులు అతి పెద్ద తొట్టెలలను తయారు చేయించి పోతరాజుల నృత్యాల నడుమ ఆలయానికి ఊరేగింపుగా తరలిస్తారు. ఈ నెల 26న గొల్కొండ బోనాల ఉత్సవాల్లో నిర్వాహకులు భారీ తొట్టెలను సామూహిక ఊరేగింపుగా పాతబస్తీ నుంచి గోల్కొండ కోటకు తరలించనున్నారు. భక్తులు అమ్మవారికి బోనంతో పాటు తొట్టెల సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. పూల తొట్టెల, వెండి తొట్టెల, బంగారు తొట్టెల..ఇలా తమ మొక్కులకు అనుగుణంగా భక్తులు అమ్మవారికి తొట్టెల సమర్పిస్తారు.

3 నుంచి 35 అడుగుల వరకు..

మహంకాళి జాతర బోనాల ఉత్సవాల్లో తొట్టెలను భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించడం తరతరాలుగా వస్తోంది. ఈ తొట్టెలలు 3 అడుగుల నుంచి 35 అడుగుల ఎత్తు వరకుంటున్నాయి. 5 నుంచి 7 అంతస్తులుగా పిలిచే ఈ రంగు రంగుల తొట్టెలను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. అమ్మవారికి తొట్టెల సమర్పించకుండా బోనం పెట్టరు. బోనంతో పాటు అమ్మవారికి తొట్టెల ఎక్కించడం తప్పని సరి. ఆషాఢ మాసం ప్రారంభం నుంచి నెల రోజుల పాటు మహంకాళి అమ్మవారి ఆలయాల్లో ప్రతిరోజూ భక్తులు తొట్టెల సమర్పిస్తారు. భక్తులు మొక్కుల రూపంలో ఈ తొట్టెలను సమర్పిస్తారు. దీంతో ఇప్పటి నుంచే తొట్టెల తయారీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి.



చార్మినార్‌లో తొట్టెల తయారు చేస్తున్న మహిళ

తొట్టెల రకాలు..ధరలు ఇలా..

ఏడు బోనాల తొట్టెల:
ఇది 25 అడుగులు పొడవుంటుంది. దీని తయారీకి వారం రోజులు పడుతుంది. ఖరీదు దాదాపు రూ.45 వేలు.

సాధారణ ఫలహారపు బండి తొట్టెల:
ఇది 25 అడుగులు పొడవుంటుంది. దీని ఖరీదు రూ.35 వేలు. తయారీకి నాలుగు రోజులు పడుతుంది.

హంస ఫలహారపు తొట్టెల:
ప్రత్యేకమైన డిజైన్‌లతో అందంగా అలంకరిస్తారు. దీని ఎత్తు 20 అడుగులు. ఖరీదు రూ.25 వేలు. ఈ తొట్టెల తయారీకి ఐదు రోజులు పడుతుంది.

పొటేల్ తొట్టెల:
ఇది 25 అడుగులు పొడవుంటుంది. ఈ తొట్టెల తయారీకి వారం రోజులు పడుతుంది. దీని ఖరీదు రూ.30 వేలు.

పాము, ఛత్రి, కమలం తొట్టెల:
ప్రత్యేక ఆర్డర్‌పై రూపొందిస్తారు. ఇది 20 అడుగు లు ఎత్తుంటుంది. దీని తయారీకి నాలుగు రోజులు పడుతుంది. ఈ తొట్టెల ఖరీదు రూ.25 వేలు.



బడిబాటలో జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్ తదితరులు

బేగంబజార్‌లో 'బడిబాట'

అబిడ్స్: బేగంబజార్‌లోని ఛత్రపతి శివాజీ కమ్యూనిటీ హాల్‌లో అంగన్‌వాడీ టీచర్లు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ జి.శంకర్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. అన్ని బస్తీలు, మురికివాడల్లో బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్యాభ్యాసం చేయాలన్నారు. వారికి ప్రభుత్వం ఉచితంగా విద్యాబోధన అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండ క్రాంతి కుమార్ సుధీర్ సింగ్, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, విద్యావతి, అర్చన వనిత ఠాకూర్, నాగలక్ష్మి, గిరిరాజు పాల్గొన్నారు.

బీజేపీ జంగమ్మెట్ డివిజన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు



చాంద్రాయణగుట్ట: బీజేపీ జంగమ్మెట్ డివిజన్ అధ్యక్షుడిగా ఆనందేశీ ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ డివిజన్ నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, ఎం.భాస్కర్, బి.విక్రం రాథోడ్, టి.యశ్వంత్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా బి.ప్రవీణ్ యాదవ్, వై.నరేష్, కార్యదర్శులుగా బి.శోభారాణి, కె.మధుమతి, కె.మహేందర్, సి.ప్రభాకర్, కోశాధికారిగా కె.జ్ఞానేశ్వరీలతో కమిటీ 34 మంది సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రావు మాట్లాడుతూ..డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అంధుల పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి

యాకుత్‌పురా: అంధుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాఠశాలను రాష్ట్రంలోని అంధ విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ బహదూర్‌పురా మండల డిప్యూటీ ఈఓ పోమ్య నాయక్ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన దారుషిఫాలోని ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధులకు విద్యానందించేందుకు 1939లో పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. ఈ పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో చదివిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, పుస్తకాలు, బ్రెయిలీ లిపీ కిట్లు, ఏఐ సౌకర్యంతో కూడిన కంప్యూటర్ ల్యాబ్ విశాలమైన ఆటస్థలం, వసతి గృహం అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అబిడ్స్‌లోని జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్యకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అన్ని ఆలయాల పరిసరాల్లో రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాట్లు, ఇతర పనులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ..అన్ని ఆలయాల వద్ద మరమ్మతులు చేపడుతామన్నారు. వీధి దీపాల మరమ్మతులతో పాటు వీధి దీపాలు పనిచేయని వద్ద కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. రోడ్ల మరమ్మతులు, ఇంజినీరింగ్ అధికారులచే చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తమ దృష్టికి ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, భజన్ సింగ్, నరేష్ గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సంతాప దినాలకు ఏర్పాట్లు



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

యాకుత్‌పురా: మొహర్రం సంతాప దినాలకు ప్రభుత్వం కేటాయించిన రూ.7 కోట్ల నిధులతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫాంది, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. జులై 5న మొహర్రం నేపథ్యంలో మంగళవారం దారుసలాంలో ఎమ్మెల్సీలు మీర్జా రియాజుల్ హసన్ అఫాంది, మీర్జా రహ్మత్ అలీ బేగ్, యాకుత్‌పురా, చార్మినార్, బహదూర్‌పురా ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మేరాజ్, మీర్ జుల్ఫీకర్ అలీ, మహ్మద్ ముబీన్, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాతబస్తీలోని డబీర్‌పురా బీబీ కా అలావాతో పాటు ప్రధాన ఆషూర్ ఖానాల వద్ద అభివృద్ధి పనులు, ఆలాంల ఊరేగింపు కొనసాగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాతబస్తీలోని బీబీ కా ఆలావాతో పాటు అన్ని ఆషూర్‌ఖానాలకు వచ్చే వారికి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీతో పాటు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్, ఎలక్ట్రికల్, టీఎస్ ఎస్‌పీడీసీఎల్, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా విద్యాబోధన



జూలూరి నిత్యశ్రీకి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ పీవీఎస్ గోపాలకృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు ప్రతిభకు అనుగుణంగా విద్యాబోధన చేస్తున్నామని ఫిడ్జి జూనియర్ కళాశాల సైఫాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఫిడ్జి కళాశాలలో ప్రతిభను చాటి టాపర్‌గా నిలవడంతో పాటు రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని జూలూరి నిత్యశ్రీకి మంగళవారం ప్రశంసాపత్రాన్ని ఫిడ్జి కళాశాల యాజమాన్యం అందజేసి ప్రశంసించారు. తమ కళాశాలలో విద్యార్థులను జాతీయ స్థాయిలో ఐఐటీ, బిట్స్, ఎన్ఐటీల్లో కూడా ఉత్తమ ప్రతిభను చాటే విధంగా ప్రత్యేక విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ లెక్చరర్లు కె.నాగరాజు, ఎం.దామోధర్, మహీంద్రా కుసుమ, ఎ.సాయికుమార్, సతీష్‌కుమార్ పాండే, జీవరత్నం, ఇంగ్లిష్ లెక్చరర్ సీహెచ్.ఇమాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



గెలుపొందిన విద్యార్థులతో రాంచంద్రరావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని బయోజనస్ ల్యాబ్ సీఎండీ డాక్టర్ రాంచంద్రరావు అన్నారు. ప్రగతి చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్విహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అండర్–10, 14 విభాగాల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులను అందజేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, సీహెచ్‌ఎం.చారి, ఎ.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్‌లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'



కార్యక్రమంలో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. మంగళవారం డివిజన్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడిలో చదివే విద్యార్థులకు అన్న ప్రసాదం, అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో స్థానికులు తమ పిల్లలను చేర్పాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీలో పౌష్టికాహారం విషయంలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. డివిజన్‌లో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ సహకారంతో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల పుష్ప, వరలక్ష్మి, శిల్ప, మాధవి, ఆశ, విజయలక్ష్మి, ప్రమోద్, జనార్దన్, రవి, సందీప్, కిరణ్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో వరదనీటి పైపులైన్ నిర్మాణం

- లక్డీకాపూల్ ద్వారకా హోటల్ చౌరస్తాలోని సమస్యకు పరిష్కారం
- త్వరలోనే పనులకు శ్రీకారం

బంజారాహిల్స్: వానాకాలం వచ్చిందంటే లక్డీకాపూల్‌లోని ద్వారకా–లక్కీ హోటల్ చౌరస్తాతో పాటు ప్రధాన రహదారి మోకాలు లోతు వరదనీటితో నిండిపోయి స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దశాబ్దాల ఈ సమస్యకు పరిష్కారం చూపడంలో అధికారులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే లక్డీకాపూల్ జాతీయ రహదారిలో ఈ సమస్యతో సతమతమవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు ప్రతిపాదించినా నిధులులేమి వెంటాడుతుండేది. వానాకాలంలో జీహెచ్‌ఎంసీ మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు ఇక్కడ 24 గంటలు అందుబాటులో ఉండడమే కాకుండా మోటార్ల సహాయంతో వరదనీటిని తోడాల్సి వస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వరదనీరు పెద్ద ఎత్తున నిలిచిపోయి స్థానికంగా రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 అధికారులు ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదించారు. పక్కా డిజైన్‌తో ఇక్కడ వరదనీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించడమే కాకుండా ఇటీవల టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చారు.

600 ఎంఎం డయా పైపులతో..

లక్డీకాపూల్ ద్వారకా హోటల్–లక్కీ హోటల్ రోడ్డు, చౌరస్తాలో వరదనీటి సమస్య పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ద్వారకా–లక్కీ హోటల్‌లో రోడ్డులో 600 ఎంఎం డయా 180 మీటర్ల మేర వేయనున్నారు. అలాగే లక్కీ రెస్టారెంట్ నుంచి రైల్వేట్రాక్ వద్ద ఉన్న 900 ఎంఎం డయా వరదనీటి పైపులోకి ఈ పైప్‌లను అనుసంధానించనున్నారు. లక్కీ రెస్టారెంట్ నుంచి రైల్వేట్రాక్ నాలా వరకు 60 మీటర్ల మేర ఒక వర్క్, ద్వారకా హోటల్ నుంచి లక్కీ హోటల్ వరకు 180 మీటర్ల మేర రెండో వర్క్ ఇలా రెండు వర్క్‌లుగా ఈ పైప్‌లైన్ నిర్మాణాన్ని విభజించారు. ద్వారకా హోటల్ నుంచి 600 ఎంఎం డయా పైప్‌లైన్ వేసి రైల్వే ట్రాక్ వద్ద ఉన్న 900ఎంఎం డయా నాలాలో కలపనున్నారు.



లక్డీకాపూల్ ద్వారకా–లక్కీ హోటల్ చౌరస్తాలో వరద ముంపును పరిశీలిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

త్వరలోనే పనులు...

లక్డీకాపూల్ రోడ్డు వాహనాల రద్దీతో, వ్యాపార లావాదేవీలతో, హోటళ్లకు వచ్చే కస్టమర్లతో నిత్యం కిటకిటలాడుతుంటుంది. రవీంద్రభారతి నుంచి అసెంబ్లీతో పాటు ఓల్డ్‌సిటీకి వెళ్లేందుకు ఇదే కూడా ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డులో భారీ వరదనీటి పైప్‌లైన్ పనులు చేపట్టాలంటే చాలా ఇబ్బందితో కూడుకున్నదని అధికారులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి అనుమతులు క్లియరెన్స్ వచ్చిన తర్వాత ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని యోచిస్తున్నారు.



వరదనీటిని తోడేస్తున్న సిబ్బంది

పనులు ప్రారంభిస్తాం..

లక్డీకాపూల్ ద్వారకా హోటల్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇక్కడ వరదనీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ఇక్కడ పైప్ లైన్ నిర్మాణం పూర్తయితే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతోంది. ఇప్పటికే అనుమతుల కోసం సంబంధిత అధికారులకు లేఖ రాశాం.
– రజనీకాంత్‌రెడ్డి, డీసీ, సర్కిల్–17

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

- బస్టాప్‌లో ఆటోల అక్రమ పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు

జియాగూడ: జియాగూడ రహదారి అంటేనే ట్రాఫిక్ మయం. అందులో రహదారులు ఇరుకుగా ఉండగా, ఆటోవాలాలు బస్టాప్‌లనే అడ్డాగా మార్చుకొని గంటల తరబడి ఆటోలను నిలిపివేస్తుండగా బస్టాప్‌లలో నిలవాల్సిన ప్రయాణికులు రోడ్లపైన నిలిచి ఉంటున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక బస్టాప్ వద్ద నిలవాల్సిన బస్సులు రోడ్డు మధ్యన నిలిచి ఉండడంతో సబ్జిమండి, మేకలమండి, పురానాపూల్ గుండా వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆటోవాలల అడ్డాగా భీమ్‌నగర్ బస్టాప్..

జియాగూడ ప్రధాన కూడలి చౌరస్తా అయిన భీమ్‌నగర్ చౌరస్తా వద్దనే 2జే బస్టాప్ ఉంది. 30 ఏళ్ల క్రితం భీమ్‌నగర్ బస్తీవాసుల కోసం బస్తీ సంఘం బస్టాప్ ఏర్పాటు చేసింది. కాగా క్రమేణా మరిన్ని బస్తీలు ఏర్పడగా ఖాళీగా ఉన్న భీమ్‌నగర్ బస్టాప్‌లో ప్రయాణికులు లేని సమయంలో ఆటోవాలాలు నిలిపి ఉంచడం ప్రారంభించారు. దీంతో బస్టాప్‌ల్లో నిలవాల్సిన ప్రయణికులు రోడ్లపైనే నిలిచి ఉండి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు.



భీమ్‌నగర్ చౌరస్తా బస్టాప్‌లో ఆటోవాలాల అక్రమ పార్కింగ్

అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి..

భీమ్‌నగర్ బస్టాప్ వద్ద నిత్యం ఆటోవాలల తిష్ట వేయడంతో ట్రాఫిక్ నిలిచి పోతోంది. అయినా లంగర్‌హౌజ్ ట్రాఫిక్ విభాగం పట్టించుకోపోవడం లేదు. ఇకనైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.